గొంతెండుతోంది!

- వేయిమంది విద్యార్థులకు ఒకే నల్లా కనెక్షన్
- మధ్యాహ్న భోజన సమయంలో నీరు సరిపోక ఇబ్బందులు
- మరో నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రుల అభ్యర్థన



ఇంటి నుంచి బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థినులు



రామంతాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం చాలా ప్రభుత్వ స్కూళ్లలో తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.

☛ రామంతాపూర్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలోని స్కూల్‌తో పాటు ప్రాథమిక పాఠశాల కూడా ఉంది. ఒకటోతరగతి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో దాదాపు 20 సెక్షన్లతో వేయిమంది విద్యార్థులు ఉన్నారు.

వేయిమందికి ఒకే నల్లా..

ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నా.. స్కూల్‌లో కేవలం తాగునీటి కోసం ఒకే నల్లా కనెక్షన్ ఉంది. ఈ నల్లా ద్వారా రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీరు సరిపోక విద్యార్థుల గొంతు తడవడం లేదు. దీంతో వారు దాహంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం సమయంలో తాగునీరు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో తాగునీటి కోసం విద్యార్థులు ఎగబడే పరిస్థితి నెలకొంది. వేయిమంది విద్యార్థులకు ఒకే ఒక నల్లా కనెక్షన్ ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇంటి నుంచి నీళ్ల బాటిల్..

కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచే నీళ్ల బాటిళ్లలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ ఈ స్కూల్‌లో విద్యార్థులకు పరిశుభ్రమైన మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేయడానికి తగినంత నీరు అందకపోవడంతో ఇది మూతపడే అవకాశం ఉంది.

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి..

మరో నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయాలని కొన్నాళ్లుగా ప్రజాప్రతినిధులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకొచ్చినా.. పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ జలమండలి అధికారులు పలు ప్రైవేట్ హోటళ్లకు వ్యాపార సంస్థలకు అదనపు నల్లా కనెక్షన్‌లు ఇవ్వడానికి ఆసక్తి చూపి మంజూరు చేస్తున్నారని, స్కూల్‌ను పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా..



విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. వెంటనే మరో నల్లా కనెక్షన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటాం. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్, తాగునీటి సమస్యతో పాటు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

– ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి..

వేయిమంది విద్యార్థులకు తాగునీరు అందించే ఒకే ఒక నల్లా కనెక్షన్ ఉండటంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. దీనిపై జలమండలి అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ తీసుకుని మరో నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయాలి.

– జంగయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్

ఖాళీ స్థలాలను పరిరక్షించండి !



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి డివిజన్ బండ చెరువును ఆనుకుని ఉన్న శివానంద్‌నగర్, పూలపల్లి బాలయ్యకాలనీలోని ఖాళీ స్థలాలను కాపాడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానిక కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. సోమవారం రంగనాథ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి డివిజన్‌లో కబ్జాలకు గురవుతున్న స్థలాల గురించి వివరించారు. ఆర్‌కేహెచ్‌కాలనీ పార్కు కూడా కబ్జాచేసి, ఇళ్లు కట్టిన విషయాన్ని గతంలోనే ఫిర్యాదు చేసినా.. సమస్య పరిష్కారం కాలేదని ఆమె సూచించారు.

కార్పొరేటర్ పర్యటన



మారుతీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: స్థానిక సమస్యలపై కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మారుతీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సోమవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆమె స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో డ్రైనేజీ, సీసీరోడ్ల సమస్యలతో పాటు నాలా పక్కన రక్షణ గోడ నిర్మాణం తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



కాప్రా: రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని చర్లపల్లి కాలనీల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బంజారా కాలనీలో రోడ్డును ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారని, తక్షణమే ఆక్రమణదారులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఎస్ ప్రెసిడెంట్ ఎంపల్లి పద్మారెడ్డి, బంజారా కాలనీలవాసులు, మహిళలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న కాలనీవాసులు

బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. బోడుప్పల్ 12,20 డివిజన్లలో సోమవారం ఘన వ్యర్థాలపై కాలనీవాసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, కాలనీవాసులు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హరిజనబస్తీలో భూగర్భ డ్రైనేజీలైన్ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని, కాలనీవాసులు సోమవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలకమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్థానిక కాలనీవాసులు తదితరులున్నారు.

సమాచార హక్కు సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా జంగయ్య

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారం ప్రాంతానికి చెందిన వంగూరి జంగయ్యను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నారపల్లికి చెందిన పెడబోయిన రామకృష్ణ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటిముదిరాజ్ సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

తీరిన తాగునీటి కష్టాలు !

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: నెలరోజులుగా కలుషిత నీటిసరఫరాతో ఇబ్బంది పడిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, ఎన్టీఆర్‌నగర్ కాలనీవాసుల తాగునీటి కష్టాలు తీరాయి. 'తాగునీటి కటకట' పేరుతో సాక్షి ప్రచురించిన కథనానికి స్పందించిన జలమండలి అధికారులు ఎట్టకేలకు కలుషిత నీటి సరఫరాకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపారు. కెమెరాల సాయంతో సమస్యను గుర్తించిన జలమండలి అధికారులు 4–5 రోజుల పాటు శ్రమించి రక్షిత తాగునీటిని అందజేశారు. కాలనీవాసుల సమక్షంలో తాగునీటి పరీక్షలు నిర్వహించి సరఫరాను పునరుద్ధరించారు.

భక్తి శ్రద్ధలతో రుద్రహోమం



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

గౌతంనగర్: మాసశివరాత్రిని పురస్కరించుకుని ఉత్తమ్‌నగర్‌లోని దుర్గాజ్యోతిష్యాలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో శివుడికి అభిషేకం, రుద్రహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించామని, నిర్వాహకులు మూగు నాగరాజుశర్మ తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

మౌలిక వసతులు కల్పించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ నార్త్‌లోని శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లోను నియంత్రించేందుకు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాకతీయనగర్‌వాసులు ప్రభాకర్‌రెడ్డి, గోపాల్, కొమురయ్య, వెంకటాచారి, సత్యనారాయణ, అజయ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

కుషాయిగూడ: ప్రతి ఒక్కరూ సామాజిక దృక్పథంతో సేవాభావాన్ని అలవర్చుకోవాలని వాసవీక్లబ్ డిస్ట్రిక్ వైస్ చైర్మన్ సముద్రాల కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. పేదలకు సాయంచేయాలనే సంకల్పంతో ఏర్పాటైన వాసవీక్లబ్ అనేక సేవా కార్యక్రమాలను చేపడుతూ.. ముందుకు సాగుతుందన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు నేర్లకంటి శ్రీనివాస్, ఉమాదేవి, శ్రీనివాస్, రజిత, సత్యనారాయణ, నాగేందర్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ 11 కేవీ స్నేహపురి ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు.

☛ 11 కేవీ నాచారం ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేడిపల్లి: 11కేవీ వరంగల్ హైవే ఫీడర్ పరిధిలో సమ్మర్ పీఎంఐ పనుల మరమ్మతుల కారణంగా 33/11పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

☛ 11కేవీ మల్లికార్జుననగర్ ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి 5.00 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు.

☛ 11కేవీ ప్రతాప్‌సింగారం ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ ప్రతాప్ సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి ఒంటి గంట వరకు కరెంటు నిలిపివేయబడుతుంది.

☛ 11కేవీ 2బీహెచ్‌కే ప్రతాప్ సింగారం ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ ప్రతాప్‌సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11కేవీ ఆకుల నర్సింగరావునగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ ఈస్ట్ చంద్రగిరి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

వినాయకనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

11 కేవీ ట్యాంక్ బండ్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్ క్రిస్టినా తెలిపారు.

మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో...

11 కేవీ ఆర్టీసీకాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ వేంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వసంతపురి సబ్‌స్టేషన్ పరిధిలో..

11 కేవీ భవానీనగర్, దయానంద్‌నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ సాయిరాం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ తెలిపారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నాచారంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలను ప్రధాని నరేంద్రమోదీ నెరవేస్తున్నారన్నారు. ఎస్టీమోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, జిల్లా బీజేపీ కార్యవర్గసభ్యులు రవికాంత్, డివిజన్ బీజేపీ సీనియర్ నేతలు మల్కా ప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, చంద్రమౌళి, ఆనంద్‌గుప్తా, ప్రతాప్‌రెడ్డి, సాయిగౌడ్, మంజుల వాణి, లావణ్య, వరలక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



బీరప్పగడ్డలోని రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ పరిధిలో బీరప్పగడ్డ దేవాలయం వద్ద గల పౌరసరఫరాల పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సన్న బియ్యం నాణ్యతను ఎమ్మెల్యే పరిశీలిస్తూ.. పంపిణీపై లబ్ధిదారులను ఆరా తీశారు. షాపు యాజమాని ఆగంరెడ్డి రేషన్ పంపిణీ గురించి వివరించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించడం లేదని వివరించారు. 30 వరకు షాపును ప్రతిరోజూ తెరిచి ఉంచాలని ఎమ్మెల్యే సూచించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కాలనీవాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలకసంస్థ 3వ డివిజన్ సాయిప్రియకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీలో సుమారుగా 600లకు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నా.. అక్కడ కనీస వసతులు లేవని వాపోయారు. ప్రజాసమస్యలను గుర్తించి త్వరితగతిన మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావును కోరారు. రంజిత్ కుమార్, సాగర్‌చారి, రమేష్‌చారి, రమేష్, దయాకర్‌రెడ్డి, శేఖర్‌చారి, నర్సింహ తదితరులున్నారు.

యువకుడి అదృశ్యం



సాయిరాం

మేడిపల్లి: ఇంటినుండి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలానికి చెందిన సాయిరాం (27) పీర్జాదిగూడ బాలాజీనగర్‌లో నివాసం ఉంటూ.. చార్టర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. గత మార్చి నెలలో తన సొంతూరుకు వెళ్లొచ్చి నగరంలోని ఇంటిని ఖాళీచేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి వెళ్లలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు సోమ వారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్టు

కుషాయిగూడ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. నెహ్రూనగర్, పోచమ్మ ఆలయం సమీపంలో కారులో గంజాయి తరలిస్తున్న నలుగురిని ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని చర్లపల్లి పోలీసులకు అప్పగించారు. వారిలో శివర్ధన్, మహమూద్, హకీం, అభిలాష్ ఉన్నారని, వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుల్లో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సీసీరోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం ఆర్‌కేనగర్‌లో రూ.40 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో యూజీడీ, తాగునీటి పైపులైన్ల పనులు పూర్తయిన తర్వాత సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కాలనీల్లో పర్యటించినప్పుడు తాగునీటి సరఫరాపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించామన్నారు. జలమండలి విభాగంలో కొంతమంది అధికారులు ప్రజాసమస్యల పరిష్కారంలో చొరవ చూపడంలేదని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్, జలమండలి మురళి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌తో సమస్యల పరిష్కారం



స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం సత్తిరెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన శానిటేషన్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వ్యర్థాల పారబోత, భవన నిర్మాణ వ్యర్థాలను కూడా రోడ్ల పక్కన పారబోస్తున్నారని, అలా చేయకుండా జీహెచ్‌ఎంసీ సీడీ విభాగం సిబ్బందికి అందించాలని సూచించారు. వారు తక్కువ ధరకే తరలిస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు రాములు, శేఖర్, బాబు, సత్యనారాయణ, కిషోర్, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్, శాస్త్రి పాల్గొన్నారు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి..



రాజాశ్రీనివాసనగర్‌లో కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత అన్నారు. సోమవారం మల్కాజిగిరి సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో రాజా శ్రీనివాసనగర్, రాజానగర్ కాలనీల్లో వర్షాకాలం ముందస్తుగా ప్రత్యేక పారిశుధ్య నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై పారిశుద్ధ్యంపై మాట్లాడారు. మేకల రాము, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది నర్సింగ్‌రావు, చిట్టిబాబు, ప్రభాకర్, స్వప్న, భాగ్యరేఖ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోలకే వ్యర్థాలను అందించాలి..

మల్లాపూర్: చెత్తను ఇష్టానుసారంగా పారబోయకుండా ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో రిక్షాకే అందించాలని నాచారం కార్పొరేటర్ శాంతి అన్నారు. సోమవారం నాచారంలో పారిశుద్ధ్యంపై సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ విభాగం ఏఈ రమేష్, పరమేష్, యూబీడీ సూపర్ వైజర్ శ్రీనివాస్, రామ్‌కీ సంస్థ సూపర్‌వైజర్ నవీన్‌రెడ్డి, జవాన్, ఎస్ఎఫ్ఏలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కార్పొరేటర్‌కు లేదు

మల్కాజిగిరి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని విమర్శించే స్థాయి మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కు లేదని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మురుగేష్, నాయకులు వెంకన్న, పరశురామిరెడ్డి అన్నారు. సోమవారం సరికొండ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించినప్పుడు ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారన్నారు. వారి కోరిక మేరకే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఎమ్మెల్యే అందజేశారన్నారు. ఇటీవల శ్రవణ్ విగ్రహాల ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పడం సరికాదన్నారు. తాము అనేక అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే ద్వారా వినతిపత్రాలు అందజేస్తున్నామన్నారు. నాయకులు రావుల అంజయ్య, రాముయాదవ్, ఉస్మాన్, శ్రీనివాస్‌గౌడ్, భాగ్యానంద్, జనార్దన్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు నిలిపేయడంతో ఇబ్బంది పడుతున్నాం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కాలనీవాసుల వినతి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, చక్రిపురం కాలనీలోని సర్వే నెంబరు–215లో నెలకొన్న సమస్యను సోమవారం కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. 215 సర్వే నెంబరులో నెలకొన్న వివాదం కారణంగా చాలా ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో ఉందని, దీనికి పరిష్కారం చూపి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిపుణులతో మాట్లాడి పరిష్కారం లభించేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, బుచ్చిరెడ్డి, కొండారెడ్డి, అశోక్, వెంకటేష్, సంతోష్ గుప్తా, ఆంజనేయులు, మాన్‌సింగ్, గంగిరెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.